
# ప్రజాస్వామిక సంస్కృతిని కాపాడుకుందాం రండి




రెండేళ్ల క్రితం ఎన్నికలు జరిగి కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడినపుడు ఏదైతే జరుగుతుందని ఊహించామో, భయపడ్డామో, ఆందోళన చెందామో ఇప్పుడు అదే జరుగుతోంది. గత రెండేళ్లలో ప్రజాస్వామ్య సంస్కృతి పట్ల, ప్రజాస్వామిక విలువల పట్ల ప్రభుత్వాలకు, ప్రభుత్వాల అండ గల శక్తులకు పెరిగిన అసహనాన్ని ఒకసారి గుర్తు చేసుకోండి. భిన్నాభిప్రాయాల మీద, ఆ అభిప్రాయాలు కలిగినవారి మీద వారు చేస్తున్న బౌద్ధిక, భౌతిక దాడులను గమనించండి. యూనివర్సిటీల నుండి ఊరీ దాకా 'దేశభక్తి' పేరు మీద వారు ఎవరెవర్ని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారో లోతుగా ఆలోచించి అర్థం చేసుకోండి. గోరక్షణ నెపంతో వారు చేస్తున్న రాజకీయాలు ఎవరిని దెబ్బతీయడానికో అవగాహన చేసుకోండి.

మతం, జాతీయత, దేశభక్తి పదాలతో వారు ప్రజలను మానసికంగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దాని ఫలితంగా సరిహద్దుల్లోనే కాదు దేశంలోనూ యుద్ధోన్మాద విద్వేష ప్రచారం నాట్యం చేస్తోందిప్పుడు. ఇవ్వాళ కాకపోతే రేపైనా కనిపించని శక్తులేవో పూనుకుని సరిహద్దు దగ్గరి యుద్ధాన్ని ఆపుతాయి కాబట్టి దాని కంటే మనం ఎక్కువ ఆందోళన చెందవలసిందీ, మన ఆలోచనలకు పదును పెట్టి ఎదుర్కోవలసిందీ ప్రజాస్వామ్య విలువలకు ఎదురవుతున్న ప్రమాదాన్ని.

ఈ ప్రయత్నాలు జరగడం లేదని కాదు. అన్యాయమైన ఆరోపణలు ఎదుర్కొని రోహిత్ వేముల మరణించినప్పుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పెల్లుబుకిన విద్యార్థి ఆందోళన అలాంటి ప్రయత్నాల్లో ఒకటి. పార్లమెంటు చేసిన భూసేకరణ చట్టాన్ని పక్కన పెట్టి అన్యాయమైన జీవో ఒకటి జారీచేసి పంట పొలాల్ని స్వాధీనం చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం పూనుకున్నప్పుడు మల్లన్నసాగర్ రైతులు చేసిన ఆందోళన అలాంటి ప్రయత్నాల్లో ఒకటి. గతంలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ బాక్సైట్ మైనింగ్ చేయాలని తలపెట్టినప్పుడు విశాఖ ఏజెన్సీలో ఆదివాసులు పెద్దఎత్తున తెలిపిన నిరసన అలాంటి ప్రయత్నాల్లో ఒకటి. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోను, గుజరాత్‌లోని ఉనాలోను, చాలాకాలంగా కశ్మీర్‌లోను, ఛత్తీస్‌గఢ్‌లోను జరుగుతున్న ఆందోళనలన్నీ కూడా అప్రజాస్వామిక ధోరణులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలే.

ఆయా సమూహాల, ప్రజల నిరసనలను, ఆందోళనలను జాతీయస్థాయిలో సంఘటితం చేయగల శక్తులేవీ ఇవ్వాళ మనకు లేకపోవడం చాలా పెద్ద లోటు. అయినా వారెవరూ మౌనంగా ఉండకుండా తమ వ్యతిరేకతను పాలకులకు స్పష్టంగా తెలియజేయడం, ఎంత నిర్బంధాన్నైనా నిర్భయంగా ఎదుర్కోవడం చాలా ఆశాజనకమైన పరిణామం. వీటిలో యువత ఎక్కువగా పాల్గొనడం భవిష్యత్‌పై నమ్మకాన్ని పెంచుతోంది. హక్కుల నాయకుడు బాలగోపాల్ వీరిని చూసి ఉంటే ఎంత సంతోషించేవారో! వారి ఉద్యమాలను తన ఆలోచనలతో ఎంత పదునెక్కించేవారో! ఆయన ఏడో వర్ధంతి సందర్భంగా అలాంటి కొన్ని ఆందోళనలలో పాల్గొన్న వ్యక్తులను వక్తలుగా ఆహ్వానించాం.

## కశ్మీర్‌లో ఏం జరుగుతోంది?

జూలై 8న బుర్హాన్ వాని (22) ఎన్‌కౌంటర్ తర్వాత కశ్మీర్ ఎంతగా రగిలిపోయిందో గత మూడు నెలలుగా చూస్తూనే ఉన్నాం. 60 రోజుల కర్ఫ్యూ, 88 మంది మృతి, పెల్లెట్ గాయాలకు కొన్ని వందలమంది కంటిచూపు కోల్పోవడం... ఇంత జరిగినా భారత రాజ్యానికి, పౌర సమాజానికి కశ్మీర్ భూభాగం తప్ప మనుషులు కనబడడం లేదు. ప్రజా ఆకాంక్షల మేరకే సరిహద్దులు ఏర్పడాలి, సమసిపోవాలి అనే కనీస ప్రజాస్వామిక విలువ గురించి మాట్లాడేవాళ్లు కరువయ్యారు. ఆ మాట మాట్లాడడమే రాజద్రోహమై కూర్చుంది. రాళ్లేసే యువత మీద పెల్లెట్ రాళ్లేసి కంటి చూపును పోగొట్టేంత క్రూరత్వాన్ని భారత రాజ్యం

# బాలగోపాల్ సంస్మరణ సభ

వేదిక: సుందరయ్య విజ్ఞాన కేంద్రం

తేది: **9.10.2016**

సమయం: **10 నుండి 4 గంటల వరకు**

**అభిప్రాయ స్వేచ్ఛపై దాడి - ఉమర్ ఖాలిద్**
భగత్‌సింగ్ అంబేద్కర్ విద్యార్థి సంఘం (బసొ), జె.ఎన్.యు, ఢిల్లీ

**బస్తర్‌లో ఆగని మారణకాండ - మనీష్ కుంజం**
ఆదివాసీ మహాసభ, ఛత్తీస్‌గఢ్

**విద్యాసంస్థల్లో కులవివక్ష - కె.వై. రత్నం**
అంబేద్కర్ అధ్యయన కేంద్రం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

**కశ్మీర్ మళ్లీ ఎందుకు రక్తమోడుతుంది? - జమీర్ అహ్మద్**
జెకెసిసిఎస్, శ్రీనగర్

ప్రదర్శించినా భారత పౌర సమాజం నుండి రావాల్సినంత వ్యతిరేకత, ఆగ్రహం రాకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

కశ్మీర్‌ను ఎప్పటికీ సరిహద్దు తగాదాగానే చూద్దామా? అదొక నెత్తురోడుతున్న గాయంలా మనకు ఎప్పుడు కనిపిస్తుంది? మనం నోరు తెరిచి ప్రశ్నించనంతకాలం భారత ప్రభుత్వం వారిని ఇదే విధంగా అణచివేస్తూ పోతుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం కశ్మీర్‌లో ఏం జరుగుతుందో చెప్పడానికి ఈ సభకు రావాల్సిన జెకెసిసిఎస్ నాయకుడు ఖుర్రం పర్వేజ్‌ను అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడమే దీనికి తాజా ఉదాహరణ. ఆయన స్థానంలో అదే సంస్థకు చెందిన జమీర్ అహ్మద్ కశ్మీర్ పరిస్థితి మీద మాట్లాడతారు.

## బస్తర్‌లో ఆగని మారణకాండ

ఎల్.టి.టి.ఇ.ని మట్టుపెట్టాలని 2008-09 లలో ప్రపంచ కళ్ళకు గంతలు కట్టి లక్షలాది మంది పౌరులను నిర్బంధ శిబిరాలకు తరలించి, వేల సంఖ్యలో స్త్రీలపై లైంగిక హింసకు పాల్పడి, సుమారు 7 వేల మంది పౌరులను ఊచకోత కోసిన రాజపక్సా భారత్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు ఇప్పుడు ఆదర్శప్రాయుడయ్యాడు, మావోయిస్టుల అణచివేత పేరుతో వారు ఛత్తీస్‌గఢ్‌లో అదే చేయాలనుకుంటున్నారు. సుప్రీంకోర్టు సల్వాజుడుం, కోయ కమాండోలను రద్దు చేస్తే వారి స్థానంలో కొత్తగా ఆగ్జిలరీ ఫోర్సును ఏర్పరిచారు. ఇతరులను జాతిద్రోహులని ముద్రలు వేసే ఈ ప్రభుత్వాలు ఛత్తీస్‌గఢ్‌లో మటుకు 'బైట' రాష్ట్రాల మేధావులను తరిమికొట్టి రాజపక్సా ఫార్ములాను అమలు పరచాలని చూస్తున్నాయి. 'బైట' రాష్ట్రాల న్యాయవాదులు అక్కడ వాదించకూడదు. 'బైట' రాష్ట్రాల విలేఖరులు అక్కడ ఉండి వార్తలు రాయకూడదు. పోలీసులు స్థాపించిన 'అగ్ని' సంస్థ మావోయిస్టులకు వ్యతిరేకంగా 'లల్కార్' యాత్రలు తీస్తుంది కాని సోని సోరిని మట్టుకు తిరంగా యాత్ర తీయనీయదు. దుర్గ-మహిషాసురుని కథపై తమకే గుత్త ఉన్నట్లు దానికి వేరే భాష్యం చెప్పిన వామపక్ష ఆదివాసీ ఉద్యమకారుడు మనిష్ కుంజంపై కేసు పెట్టింది. అంతర్యుద్ధ వాతావరణం అలుముకున్న కల్లోల ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం ఏమి జరుగుతున్నదో మనిష్ కుంజం మనతో పంచుకుంటారు.

## యూనివర్సిటీలపై దాడి

విశ్వవిద్యాలయాల్లో ఆలోచనలకు పహరా కాయడం పెరిగింది. విద్యార్థులెవరూ కశ్మీర్ గురించి మాట్లాడకూడదు. ఛత్తీస్‌గఢ్ గురించి మాట్లాడకూడదు. ముజఫర్‌నగర్ గురించి, అక్కడి సహాయక శిబిరాల్లో చనిపోతున్న పిల్లల గురించి మాట్లాడకూడదు. అఖ్లాక్ హత్య గురించి అసలే మాట్లాడకూడదు. మాట్లాడితే రోహిత్ వేములను నెట్టినట్లే మృత్యువు నోట్లోకి నెడతారు. ఒక చేతిలో బాబాసాహెబ్ పటాన్ని మరో చేతిలో పక్కబట్టలను పట్టుకుని వెనక్కి తిరిగి చూసుకుంటూ రోహిత్ తారలను వెతుక్కుంటూ వెళ్లిపోయాడు. రోహిత్ నమ్మకాలను పంచుకున్న మనం రాధికగారి కడుపు కోతను చూసి బాధపడుతున్నాం కాని వి.సి. అప్పారావు దగ్గర నుండి కేంద్రమంత్రుల వరకు ఒక్కరికీ తప్పు చేసామన్న అపరాధ భావం లేదు. అగ్రకుల ఆధిపత్య వ్యవస్థ, రాజకీయ పాలనా వ్యవస్థ కలిసి బడుగులను ఎలా అణచివేస్తున్నాయో, వారి అభిప్రాయ స్వేచ్ఛను ఎలా మట్టుపెడుతున్నాయో హెచ్.సి.యు., జె.ఎన్.యు. విద్యార్థులపై దాడుల ద్వారా స్పష్టమైంది. దళితులపై, మైనారిటీలపై, ఆదివాసులపై, పేదవారిపై, స్త్రీలపై, ప్రతి అణగారిన వర్గంపై జరుగుతున్న జులుంకి వ్యతిరేకంగా 'హల్లా బోల్' అంటున్న జె.ఎన్.యు. ఉద్యమ విశేషాలు మనతో పంచుకోవడానికి భగత్‌సింగ్, అంబేద్కర్ విద్యార్థి సంఘం (బసొ) కార్యకర్త అయిన జె.ఎన్.యు. విద్యార్థి ఉమర్ ఖాలిద్ వస్తున్నారు. విశ్వవిద్యాలయాలను కులం, మతం, ప్రాంతం వంటి సంకుచిత భావాలకు పరిమితం చేసి భావాలకు సంకెళ్ళు వేస్తే మిగిలేది భయం ఒక్కటే. ప్రేమ, బాధ, జీవితం, మృత్యువు వంటి విషయాలలో సైతం మహా మొరటుగా వ్యవహరించే కులవ్యవస్థ విషపరిష్వంగంలో కూరుకుపోయిన విశ్వవిద్యాలయాలను సంస్కరించాల్సిందెలాగో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.వై.రత్నం చెబుతారు.

హిందుత్వవాదం మన మెదళ్లకు చుడుతున్న ఉరితాళ్ళన్నిటినీ తెంచే ప్రయత్నం చేద్దాం. ఇప్పటికే ఊపిరి సలపడం లేదు. బాలగోపాల్ 7వ వర్ధంతి సందర్భంగా అందరం కలుద్దాం. విందాం. పరిస్థితులు మెరుగవుతాయో ఆలోచిద్దాం. అందరూ రండి.

**4.10.2016**
హైదరాబాద్

మానవహక్కుల వేదిక
**Human Rights Forum (HRF)**

---

ప్రచురణకర్తలు : **ఎస్. జీవన్ కుమార్** - 98489 86286, **వి.ఎస్. కృష్ణ** - 94404 11899

**కొత్త ప్రచురణలు**

**1. విస్థాపన - విధ్వంసం 2. ఆదివాసులు: చట్టాలు అభివృద్ధి 3. కొన్ని తెలంగాణ వ్యాసాలు 4. కశ్మీర్‌పై బాలగోపాల్**
**5. విశాఖలో 7వ నెంబరు ప్రమాద హెచ్చరిక 6. బాలగోపాల్ తెలుగు ఉపన్యాసాలు (డివిడి & సిడి)**